సాక్షి సిద్దిపేట

శనివారం । 26 । అక్టోబర్ । 2024



శుద్ధి ఇక సులువే..

కొనుగోలు కేంద్రాలకు తేమ, ధాన్యం శుద్ధి చేసే యంత్రాలను పంపిణీ చేయాలని సర్కార్ నిర్ణయించింది. వివరాలు 10లో ▸



కొబ్బరి పువ్వు..

కొబ్బరి కాయలే కాదు.. అందులోని పువ్వు సైతం ఎన్నో ప్రయోజనాలను కలిగిస్తోంది. వివరాలు 10లో ▸



మురుగు ఇలా.. ఆడేదెలా?

పాఠశాల ఆవరణలో నిత్యం మురుగు పారుతుంది. ఆటలాడలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించండి

మంత్రికి మెప్మా ఆర్పీల వినతి



మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఆర్పీల సంఘం నాయకులు

సిద్దిపేటజోన్: మెప్మా పరిధిలో పనిచేసే ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్‌బాబుకు వినతిపత్రాలు అందజేశారు. ఆర్పీల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీమతి ఆధ్వర్యంలో మంత్రులను కలిసి సమస్యలు వివరించారు. జీఓ164 మార్పు చేయాలని, ఆర్పీలకు కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని కోరారు. జీఓ మార్పు విషయం సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, 5నెలల పెండింగ్ వేతనాలు త్వరితగతిన విడుదల చేస్తామని మంత్రులు హామీ ఇచ్చినట్లు శ్రీమతి పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ



కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వరి ధాన్యంలోని తేమ శాతం పరిశీలించాలన్నారు. నిబంధనల మేరకు విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు తెలపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ జయదేవ్‌ఆర్య, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, ఏపీఎం నర్సయ్య, సీసీ సారయ్య తదితరులు పాల్గొన్నారు.

మరో రూ.30లక్షలు మంజూరు

జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి వెల్లడి



హుస్నాబాద్‌లో నిర్మిస్తున్న గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న లింగమూర్తి

హుస్నాబాద్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని శుక్రవారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ భవనానికి మరో రూ.30లక్షల నిధులు మంజూరైనట్లు చెప్పారు. వాటితో త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. అదేవిధంగా గజ్వేల్, దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లో సైతం గ్రంథాలయాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు, సాహితీవేత్తలకు గ్రంథాలయాలు అన్ని విధాలుగా ఉపయోగపడేలా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు.

నూతన జీపీల్లో కార్యాలయాల ఏర్పాటు



సేవాలాల్ మహారాజ్‌తండాలో నూతన పంచాయతీ కార్యాలయం ఏర్పాటు

అక్కన్నపేట(హుస్నాబాద్): నూతనంగా ఏర్పాటైన పంచాయతీల్లో కార్యాలయాలను ఏర్పాటు చేశారు. సరిరాంతండా, అంబనాయక్‌తండా, చౌటకుంటతండా, సేవాలాల్ మహారాజ్‌తండా, దాస్‌తండా, చౌడుతండా గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీఓ భానోతు జయరాం కార్యాలయాలను ఏర్పాటు చేయించారు. ఆయన మాట్లాడుతూ తాత్కాలికంగా ఏర్పాటు చేసిన భవనాల్లో విధులు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ గుగులోతు మోహన్, ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకర్, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మి నమోస్తుతే..

రూ.11 లక్షల కరెన్సీ నోట్లతో కన్యకాపరమేశ్వరి మాత ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. దుబ్బాక మండల కేంద్రంలో వాసవి కన్యకాపరమేశ్వరి మాత ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి సామూహిక అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని, గర్భాలయాన్ని రూ.11 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించి విశేష పూజలు చేశారు. అర్చనల అనంతరం మహిళలు లలితా సహస్ర నామ పారాయణం, సామూహిక కుంకుమార్చన, తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.

– దుబ్బాకటౌన్



కరెన్సీ నోట్లతో అమ్మవారి అలంకరణ

సుడా.. ఇక బడా

సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా)ని విస్తరించారు. సుడా పరిధి పెరిగింది. హెచ్‌ఎండీఏ పరిధిలోని వర్గల్, ములుగు, మర్కూక్ మండలాలు మినహా అన్ని మండలాలు సుడా పరిధిలోకి చేర్చారు. ఈ మేరకు పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ప్రగతి, అభివృద్ధి పనులు అన్ని సుడా ద్వారా ముందుకు సాగనున్నాయి. ఆదాయం సైతం పెరగనుంది.



సుడా కార్యాలయం

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) అక్టోబర్ 30, 2017న ఏర్పాటు చేశారు. సిద్దిపేట మున్సిపాలిటీతో పాటు 10 కిలో మీటర్ల పరిధిలో ఉన్న 26 గ్రామాలతో పురుడు పోసుకుంది. 2018 ఏప్రిల్ 14న 14 మందితో పాలక మండలి ఏర్పాటు చేశారు. సుదీర్ఘకాలం పాటు రవీందర్ రెడ్డి చైర్మన్‌గా పని చేశారు. ఇటీవల విస్తరణ కోసం కలెక్టర్ నుంచి ప్రతిపాదనలు స్వీకరించారు. వాటిని పరిశీలించి పురపాలక శాఖ అమోదం తెలిపింది. దీంతో జిల్లా అంతటా విస్తరించింది.

జిల్లా అంతా విస్తరణ

- పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోకే 23 మండలాలు
- గజ్వేల్, దుబ్బాక, చేర్యాల, హుస్నాబాద్ మున్సిపాలిటీలు సైతం..
- పెరగనున్న ఆదాయం

నాలుగు మున్సిపాలిటీలు..

గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల మున్సిపాలిటీలతో పాటు 22 మండలాల పరిధిలోని 286 గ్రామాలకు సుడాను విస్తరించారు. సిద్దిపేట అర్బన్, రూరల్, నారాయణరావుపేట, చిన్నకోడూరు, నంగనూరు, దుబ్బాక, తొగుట, మిరుదొడ్డి, దౌల్తాబాద్, అక్బర్‌పేట-భూంపల్లి, రాయపోలు, గజ్వేల్, కొండపాక, కుకునూరుపల్లి, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, మద్దూరు, చేర్యాల, కొమురవెల్లి, బెజ్జంకి, దూల్మిట్ట మండలాలు సుడా పరిధిలోకి రానున్నాయి. దీంతో ప్రగతి ప్రణాళికలను సుడా ఆధ్వర్యంలో రూపొందించనున్నారు. ఇక డిస్ట్రిక్ట్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ)ని రద్దు చేసే అవకాశం ఉంటుంది.

అక్రమ లేఅవుట్లకు చెక్

స్థానిక మున్సిపల్ చైర్మన్, సర్పంచ్, ఇతర ప్రజా ప్రతినిధులను మచ్చిక చేసుకుని గ్రామాల్లో, పట్టణాల్లో అక్రమ లేఅవుట్లు ఏర్పాటయ్యేవి. అంతర్గత, మెయిన్ రోడ్లు తక్కువ వెడల్పుతో నిర్మించేవారు. ఆయా ప్లాట్లను గుట్టు చప్పుడు కాకుండా క్రయ విక్రయాలు జరిపేవారు. ఇక నుంచి అక్రమ లేఅవుట్లకు సుడా చెక్ పెట్టనుంది. ఏ లేఅవుట్ అయినా సుడా ద్వారా అనుమతి పొందాలి.

పెరగనున్న ఆశావహుల సంఖ్య

జిల్లా అంతటా సుడా విస్తరించడంతో చైర్మన్ పదవి ఆశించే వారి సంఖ్య సైతం పెరగనుంది. గతంలో సిద్దిపేట నియోజకవర్గం వారే ఆశించేవారు. ఇప్పుడు గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్‌లకు సంబంధించిన వారు కూడా చెర్మన్ పదవిని ఆశించనున్నారు. గతంలో పదవి ఆశించిన వారి ఆశలు గల్లంతైనట్లేనని చర్చ జరుగుతోంది. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక ఎమ్మెల్యేలుగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారు ఉండటంతో కాంగ్రెస్‌లో బలమైన నేతకు సుడా చైర్మన్ పదవి ఇచ్చేందుకే విస్తరించినట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

విద్యారంగం అభివృద్ధికి ప్రాధాన్యం


- గజ్వేల్ పాలిటెక్నిక్ రూపురేఖలు మారుస్తా
- గత బీఆర్‌ఎస్ పాలనలో భవనానికి సున్నం కూడా వేయని దుస్థితి
- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, చిత్రంలో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి తదితరులు

గజ్వేల్‌రూరల్: విద్యారంగాన్ని అన్నివిధాలుగా అభివృద్ధికి కృషి చేస్తానని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్ ప్రాంగణంలో డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో పాలిటెక్నిక్ కళాశాలకు సున్నం కూడా వేయలేదని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితుల అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి వారిపట్ల చిన్నచూపు చూసిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టగా తదనంతరం అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం కమిషన్ల కోసమే కాళేశ్వరం తీసుకువచ్చిందని విమర్శించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లోని హాస్టళ్లను సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల నుంచి స్టూడెంట్ మేనేజ్మెంట్‌గా మార్చారని, దీంతో మెస్ చార్జీలు చెల్లించలేక పదేళ్లపాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మౌలిక వసతులు, సౌకర్యాలు లేక హాస్టల్ విద్యార్థులు అవస్థలు పడుతుండగా గజ్వేల్ నుంచి ప్రాతినిధ్యం వహించిన కేసీఆర్ ఇక్కడి పాలిటెక్నిక్ కళాశాలకు కనీసం సున్నం వేయించ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల పాలనలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చిందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. నెల రోజుల్లో గజ్వేల్ పాలిటెక్నిక్ కళాశాలలోని సమస్యలను పరిష్కరించి, ఇదే ప్రాంతం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్‌ఎస్ అవినీతి, అక్రమ పాలనపై చాటిచెబుతానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక బద్ధంగా నిధుల కేటాయించాలి



మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రమేశ్

హుస్నాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రణాళిక బద్ధంగా కేటాయించాలని జెడ్పీ సీఈఓ రమేశ్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయా గ్రామాలకు కేటాయించిన నిధులు, పనుల వివరాలను పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో జనాభా ప్రకారం అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని అన్నారు.

నెట్‌బాల్, జుడో జట్ల ఎంపిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉమ్మడి మెదక్ జిల్లా నెట్‌బాల్, జుడో అండర్-14, 17 జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి సౌందర్య తెలిపారు. ఈ నెల 26న కోహెడలోని మోడల్ స్కూల్ నాగసముద్రాలలో ఉదయం అండర్-17లో బాలబాలికల ఎంపిక ఉంటుందన్నారు. జుడో జట్ల ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)ని 9246666472 నంబర్ ద్వారా సంప్రదించాలన్నారు. అలాగే అండర్-14, 17 బాలబాలికలకు నెట్‌బాల్ ఎంపికలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రజ్ఞాపూర్‌లో నవంబర్ 2న ఉదయం నిర్వహించనున్నట్లు తెలిపారు. నెట్‌బాల్ జట్ల ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రజ్ఞాపూర్ ఫిజికల్ డైరెక్టర్ (9963996911)ను సంప్రదించాలన్నారు.

నిర్వాసితుల ఉపాధిని అడ్డుకునే కుట్ర

- అందుకే ఎన్‌జీటీలో కేసులు
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: వర్గల్ ఫుడ్ పార్కుపై కాంగ్రెస్ నాయకులు ఎన్‌జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్)లో వేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా మాజీ సీఎం కేసీఆర్ ఫుడ్ పార్కు ఏర్పాటు కోసం సంకల్పించారని, ఈ క్రమంలోనే 2వేల ఎకరాల భూసేకరణ కూడా జరిగిందని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ నేతలు మల్లన్నసాగర్ నిర్వాసితుల ఉపాధిని అడ్డుకునేవిధంగా ఎన్‌జీటీలో కేసులు వేసి పనులను అడ్డుకున్నారని ఆరోపించారు. అంతేకాకుండా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, షబ్బీర్‌అలీలతోపాటు కోదండరామ్‌రెడ్డిలు దీక్షలు చేపట్టి భూములు కోల్పోతున్న వారికి ఎకరాకు రూ.50లక్షల పరిహారం ఇవ్వాలని అప్పట్లో డిమాండ్ చేశారని గుర్తు చేశారు. నేడు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో హామీలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఉపాధినిచ్చే వర్గల్ ఫుడ్ పార్కు ముందుకు సాగేలా చూడాలన్నారు.

మెగా ఫారిన్ జాబ్ మేళా

- హుస్నాబాద్‌లో నిర్వహణకు ఏర్పాట్లు
- నిరుద్యోగులు పేరు నమోదు చేసుకోండి: మంత్రి పొన్నం



ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి ప్రభాకర్

హుస్నాబాద్: అభివృద్ధి చెందిన దేశాల్లో ఉద్యోగ అవకాశాలు పొందేలా నవంబర్ రెండో వారంలో హుస్నాబాద్‌లో మెగా ఫారిన్ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం మంత్రి ఛాంబర్‌లో టాంకాం కంపెనీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజవర్గంలోని నిరుద్యోగ యువత ఫారిన్ జాబ్ మేళాకు పేరు నమోదు చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ దేశాల్లో మంచి జీతాలతో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా మెగా ఫారిన్ జాబ్ మేళాను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించామన్నారు. జాబ్ మేళా కోసం మండలాల్లో అవగాహన కల్పించాలని మూడు జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత డేటా సేకరించి విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రోత్సహించాలని సూచించారు. ఇప్పటికే హుస్నాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు మంచి స్పందన వచ్చిందని, దాని ద్వారా 5వేల మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయని తెలిపారు. సమావేశంలో స్పెషల్ సెక్రటరీ ఇండస్ట్రీస్ టాంకాం సీఈఓ విష్ణువర్ధన్ రెడ్డి, టాంకాం జీఎం నాగ భారతి, మేనేజర్ షబ్నా, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

- గురుకుల బాలికల పాఠశాలను మార్చండి
- వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలి
- అధికారులకు కలెక్టర్ మనుచౌదరి ఆదేశం



మర్కూక్‌లోని కేజీబీవీలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ మనుచౌదరి

మర్కూక్(గజ్వేల్): మండల కేంద్రానికి సాంఘిక గురుకుల బాలికల పాఠశాలను మార్చేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. కొండపాకలోని అద్దె భవనంలో కొనసాగుతున్న గురుకులంలోని 600మంది విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక వసతులు, సౌకర్యాలను కల్పిస్తూ త్వరలోనే ఇక్కడకు మార్చి ప్రారంభించాలన్నారు. పోలీస్ కమిషనర్ అనురాధతో కలిసి శుక్రవారం మర్కూక్ మండల కేంద్రంలోగల పోలీస్ గృహ సముదాయాలతో పాటు సమీకృత కార్యాలయ సముదాయ భవనాన్ని, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అయా భవనాలకు కావాల్సిన మౌలిక సౌకర్యాలపై ఆరా తీస్తూ వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు, సీడీ ఫైల్స్‌ను తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారి సమస్యలను వింటూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని, విధి నిర్వహణలో అలసత్వం వహించకూడదన్నారు. విద్యాసంస్థలు, ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘా పెట్టాలని, గ్రామాలు, పట్టణాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. అదే విధంగా కేజీబీవీలో వసతుల కల్పనతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ మల్లారెడ్డి, ఆర్డీవో బన్సీలాల్, సోషల్ వెల్ఫేర్ జోనల్ అధికారి ప్రత్యూష, గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, ప్రిన్సిపాల్ సవిత, కేజీబీవీ ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాల సందర్శన

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలను శుక్రవారం కలెక్టర్ మనుచౌదరి సందర్శించారు. కళాశాల ఆవరణలో టీజీఐఐసీ నిర్మిస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. నూతనంగా ఈ యేడు ఎన్ని అడ్మిషన్లు వచ్చాయంటూ అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఐటీఐ కోర్సులు జీవనోపాధి కోసం ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ బన్సీలాల్, తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం జలాలు అందించండి



కాళేశ్వరం కాలువను సందర్శించిన రాజాపేట మండల బీఆర్‌ఎస్ నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మల్లన్నసాగర్ జలాశయం నుంచి 15వ ప్యాకేజీ ద్వారా రాజాపేట మండలానికి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు జగదేవ్‌పూర్ శివారులోని కాళేశ్వరం కాలువను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాజపేట మండలానికి సాగునీరు అందించాలనే ఉద్దేశంతో కాళేశ్వరం 15వ ప్యాకేజీ కింద రూ.12 కోట్లతో కొంతమేర కాలువ పనులను చేపట్టిందని గుర్తు చేశారు. ఇటీవల రాజపేట కాంగ్రెస్ నాయకులు ఈ కాలువను సందర్శించి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సొంత నిధులతో పనులను ప్రారంభిస్తారని చెప్పారని, పక్షం రోజులైనా పనులను ప్రారంభించలేదని ఎద్దేవా చేశారు.

వరి కోతలు.. వీడని వెతలు

పంట చేతికొచ్చేవేళ వెంటాడుతున్న వరుణుడు

- రైతుల్లో అయోమయం
- జిల్లాలో 3.68 లక్షల ఎకరాల్లో వరిసాగు



వర్షాలకు నేలవాలిన వరి పంట

దుబ్బాక: రైతన్నల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా తయారైంది.. అప్పులు తెచ్చి పుట్టెడు పెట్టుబడులు పెట్టి పంటలు వేస్తే.. తీర పంటచేతికొచ్చే దశలో వర్షాలు పరేషాన్ చేస్తున్నాయి. వానాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో జిల్లాలో రికార్డు స్థాయిలో వరి సాగు అయ్యింది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఇప్పటికే పెద్ద ఎత్తున పత్తిపంటలకు నష్టం వాటిల్లింది. వానలకు మొక్క ఎదగక కాయలు అంతంత మాత్రంగానే ఉండడంతో కనీసం పెట్టుబడులు కూడా దక్కేపరిస్థితి కనబడడం లేదు. వరిపంటలు బాగా ఉండడంతో దీనిపైనే ఆశలు పెట్టుకున్న రైతులకు చేతికొచ్చే దశలో వర్షాలు రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వరికోతలు మొదలు అవుతున్న తరుణంలోనే అల్పపీడనం ప్రభావంతో ఇరవై రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వరికోతలకు ఇబ్బందిగా మారింది.

3.68 లక్షల ఎకరాల్లో వరిసాగు..

జిల్లాలో ఈ వానాకాలంలో రికార్డు స్థాయిలో 3.68 లక్షల ఎకరాల్లో వరిపంటలు సాగు అయ్యాయి. వరితో పాటు పత్తి, మొక్కజొన్న, కందితో పాటు ఇతర అన్ని రకాల పంటలు కలిపి 5.80 లక్షల ఎకరాల వరకు సాగు అయ్యాయి. ఇప్పటికే వరిపంటలు 70 శాతం వరకు ఎర్రబడి కోత దశకు చేరుకున్నాయి. వారం రోజుల నుంచి జిల్లాలోని చాలా గ్రామాల్లో వరికోతలు ప్రారంభం అయ్యాయి.

ఆందోళనలో రైతులు..

చేతికొస్తాయనుకున్న దశలో వానలు పడుతుండడంతో రైతులు పంటలు ఏలా దక్కించుకోవాలనే పరేషాన్‌లో ఉన్నారు. సరిగ్గా వరికోతలు ప్రారంభం కావడం ఈ క్రమంలోనే ఇరవై రోజులుగా జిల్లాలోని దుబ్బాక, హుస్నాబాద్, మిరుదొడ్డి, గజ్వేల్, సిద్దిపేట, తొగుట, వర్గల్, దౌల్తాబాద్, నంగునూరు, చిన్నకోడూరు, చేర్యాల, కొమురవెల్లి, రాయపోల్, కొండపాక, జగదేవ్‌పూర్, ములుగు మండలాల్లో వర్షాలు పడడంతో వరికోతలకు ఇబ్బందిగా తయారైంది.

వరి ఎట్ల కోసుడో..?



వానాకాలంలో పది ఎకరాల్లో వరిపంట వేశాను. పంట చేతికొచ్చే సమయంలోనే వానలు పడుతుండడంతో తడారిన పొలం బురదగా మారింది. మిషన్ దిగబడేటట్టు ఉంది. ఎం చేయాలో తోస్తలేదు. వరి పంట ఎట్ల కోయాలో.. అయోమయంగా ఉంది. రైతులందరి పరిస్థితి ఇలాగే ఉంది.

–రేపాక భూపతిరెడ్డి, దుబ్బాక

ఇప్పుడే కోతలు వద్దు..



వరికోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. కొన్ని రోజులుగా వానలు పడుతుండడంతో ధాన్యం ఆరబెట్టుకోవడం కూడా కష్టంగా మారింది. వర్షాలు తగ్గే వరకు వరికోతలు కోయవద్దు. కోసిన రైతులు ధాన్యం తడవకుండా చూసుకోవాలి. వరిపంటలు చాలా వరకు కోత దశకు వచ్చాయి.

– ప్రవీణ్‌కుమార్, వ్యవసాయాధికారి

క్లుప్తంగా

తహసీల్దార్ నిర్లక్ష్యంతో మా తల్లి చనిపోయింది

అర్కెలలో ఓ కుటుంబీకుల ఆవేదన


దుర్గమ్మ(ఫైల్)

పాపన్నపేట(మెదక్): వారసత్వ భూమి పౌతీ కోసం కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పాపన్నపేట రెవెన్యూ అధికారులు కనికరించకపోవడంతో దివ్యాంగురాలైన తమ తల్లి కన్ను మూసిందని మండల పరిధిలోని అర్కెల గ్రామానికి చెందిన జన్నుల మోహన్, గౌరమ్మ, మాణెమ్మ, వెంకటమ్మ ఆరోపించారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. తండ్రి జన్నుల వెంకయ్య 2023 నవంబర్‌లో చనిపోయాడని, అతడి పేరిట ఉన్న 18.5 గుంటల వ్యవసాయ భూమిని తమ తల్లి జన్నుల దుర్గమ్మ పేరిట పౌతీ చేయడానికి స్లాట్ బుక్ చేసుకున్నామన్నారు. 4వ తేదీన పౌతీ కావాల్సి ఉండగా 20 రోజులుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నాడని వాపోయారు. దీంతో తమ తల్లి బుధవారం వరకు తిరిగి మనోవేదనకు గురై గురువారం రాత్రి చనిపోయినట్లు తెలిపారు. అధికారులపై తగిన చర్య తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ సతీష్‌ను వివరణ కోరగా భూమి విస్తీర్ణంలో వ్యత్యాసం ఉండటం వల్లే పౌతీ చేయడంలో ఆలస్యం జరిగిందన్నారు.

ఉపాధి హామీ పనులతో రైతులకు లబ్ధి

స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ కృష్ణమూర్తి


పని ప్రదేశాలను పరిశీలిస్తున్న కృష్ణమూర్తి

మద్దూరు(హుస్నాబాద్): ఉపాధి హామీ పనులతో రైతులకు లబ్ధి చేకూరుతుందని ఉపాధి హామీ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ కృష్ణమూర్తి అన్నారు. 2025–26 సంవత్సరానికి గాను నూతన పని ప్రదేశాలను పరిశీలించేందుకు శుక్రవారం ఉమ్మడి మద్దూరు మండల పరిధిలోని రెడ్యానాయక్ తండా, వంగపల్లి గ్రామలను సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి నేరుగా రైతులతో మాట్లాడారు. ఉపాధి హామీ పనులతో ఏమైనా లబ్ధి చేకూరుతుందా అని ఆరా తీశారు. ఉపయోగపడుతుందని సమాధానం ఇచ్చారు. ఉపాధి హామీ పనులతో రైతులతోపాటు గ్రామాల్లో ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శివాజీ, ఎంపీడీవో రామ్మోహన్, అధికారులు నూరద్దీన్, పరుశరామ్, దేవేందర్, శ్రీనివాస్, వెంకటమ్మ, అనిత, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి దందా

ముగ్గురిపై కేసు, వాహనాలు స్వాధీనం


జేసీబీ, టిప్పర్లను పట్టుకున్న పోలీసులు

కొండపాక(గజ్వేల్): అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న ముగ్గురితోపాటు జేసీబీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముద్దాపూర్ శివారులో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని సమాచారం అందింది. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, కుకునూరుపల్లి పోలీసులు శుక్రవారం తెల్లవారు జామున దాడులు నిర్వహించారు. అక్కడ అనుమతి లేకుండా మట్టిని తరలిస్తుండగా జేసీబీతోపాటు టిప్పర్లను పట్టుకున్నారు. ఇందులో లింగాయపల్లి తండాకు చెందిన గుగులోతు శ్రీకాంత్, బానోతు సాయిరాం, బంగ్ల వెంకటాపూర్‌కు చెందిన కొత బోయిన వీరేశ్‌తోపాటు జేసీబీ డ్రైవర్ అఖిలేష్ కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్షుద్రపూజల కలకలం

కొమురవెల్లి(సిద్దిపేట): మండల పరిధిలోని అయినాపూర్‌గ్రామ శివారులోని ఊరగుట్ట సమీపంలో అనుమానాస్పదంగా ఒక మేక పోతును కోసిన ఘటన శుక్రవారం కలకలం రేపింది. ఎవరైన గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేశారా.. లేక మూఢ నమ్మకాలను ఆసరాగా చేసుకొని మేకను కోసి ఉంటారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి విచారణ చేపట్టారు.

శుద్ధి ఇక సులువే..

రైతు పండించిన ధాన్యం కొనుగోళ్ల సీజన్ వచ్చేసింది. ఇప్పటికే జిల్లాలో కొన్నిచోట్ల కొనుగోళ్లు సైతం ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన యంత్రాలు లేక ఇబ్బందులు పడుతున్న నిర్వాహకులు, అన్నదాతలకు ఊరట లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు తేమ చూసే యంత్రాలు, ధాన్యం శుద్ధి చేసే యంత్రాలను పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుంది. సుమారు రూ.10 లక్షలు వెచ్చించి ఒక్కో ప్యాడీ క్లీనర్, రూ.2 లక్షలతో తేమ మిషన్‌లను కొనుగోలు చేసి ఇవ్వనుంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసి పూర్తి బాధ్యతలు పౌర సరఫరా శాఖకు అప్పగించారు. – సిద్దిపేటజోన్

- జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు యంత్రాలు
- రూ.10 లక్షలతో ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్
- రూ.2 లక్షలతో తేమ మిషన్లు
- ప్రతిపాదనలు పంపిన జిల్లా అధికారులు
- ప్రభుత్వం సైతం ఆసక్తి



ఓ కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్ యంత్రాలు

సిద్దిపేట జిల్లాలోని 14 మార్కెట్ కమిటీ పరిధిలో కొత్తగా యంత్రాలు రానున్నాయి. ఈ సీజన్‌లో వాటిని అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మరోవైపు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు ఆయా మార్కెట్ యార్డుల్లో అవసరమైన పరికరాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేకంగా ఆటోమేటిక్ ప్యాడీ క్లినర్లు పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుంది.

చెత్త, పొట్టు తొలగింపు

జిల్లా వ్యాప్తంగా సిద్దిపేట, చిన్నకోడూర్, నంగనూర్, తొగుట, దౌల్తాబాద్, కొండపాక, మిరుదొడ్డి, దుబ్బాక, బెజ్జంకి, హుస్నాబాద్, కోహెడ, గజ్వేల్, చేర్యాల, వంటిమామిడి మార్కెట్ యార్డులు ఉన్నాయి. ఆయా మార్కెట్ కమిటీ పరిధిలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. ప్రతీ సీజన్‌లో రైతు మద్దతు ధర కోసం పండించిన పంటలను కేంద్రాలకు తేవడం, తేమశాతం, పొట్టు,


సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్

దుమ్ము, చెత్త పేరిట మద్దతు ధర అందడం కొంత ఇబ్బందులకు దారితీస్తుంది. కొన్నిసార్లు ధాన్యం పెద్ద ఎత్తున యార్డులో ఉండడంతో ప్యాడీ క్లీనర్లు, తేమ యంత్రాలు అవసరానికి అనుగుణంగా అందుబాటులో లేక సమస్యలు తలెత్తుతాయి. ఈ క్రమంలో యార్డులో ప్యాడీ క్లీనర్ల సహాయంతో చెత్త, పొట్టు తొలగించి, తేమ పరీక్ష యంత్రం ద్వారా మద్దతు ధరకు అనుగుణంగా ఉండేలా చూస్తారు. ప్రభుత్వం కూడా ముందస్తుగా సమీక్ష, సమావేశాలు ఏర్పాటు చేసి అవసరమైన యంత్రాల సమాచారం ప్రకారం ముందుకు సాగుతోంది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం జిల్లాలో ఆయా మార్కెట్ కమిటీ, ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా పరిధిలో 584 ప్యాడీ క్లీనర్లు, 532 తేమ పరీక్ష యంత్రాలు ఉన్నాయి.

అదనంగా 60 ప్యాడీ క్లీనర్లు, 135 తేమ పరీక్ష యంత్రాలు

జిల్లాలోని 14 మార్కెట్ కమిటీ పరిధిలో కొనుగోలు కేంద్రాలకు అవసరమైన యంత్రాలు మంజూరు కోసం జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు. ఈ లెక్కన ప్రస్తుతం ఉన్న వాటికి అదనంగా మరో 60 ప్యాడీ క్లీనర్లు, 135 తేమ పరీక్ష యంత్రాల కోసం ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి సీజన్‌లో సాంకేతిక పరిజ్ఞానం బాగా ఉండే ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు, తేమ పరీక్ష మిషన్లు ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లాలోని ఆయా మార్కెట్ కమిటీ పరిధిలో ఒక్కో ప్యాడీ క్లినర్, తేమ యంత్రం త్వరలో రానున్నాయి.

ప్రతిపాదనలు పంపించాం



జిల్లాలో ప్రస్తుతం ఉన్న ప్యాడీ క్లీనర్లు, తేమ చూసే యంత్రాలకు అదనంగా మరిన్ని అవసరం అని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం కూడా ఈ సీజన్‌లో ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు, తేమ మిషన్లు కొనుగోలు చేసి ఇవ్వాలని నిర్ణయించారు. అందుకు సంబంధించిన సమాచారం వచ్చింది.
–నాగరాజు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

14 మంది విద్యార్థినులకు అస్వస్థత


చికిత్స పొందుతున్న విద్యార్థినులు


వంట గదిలో వస్తువులను పరిశీలిస్తున్న డీఈఓ

- ఆస్పత్రికి తరలించిన ఉపాధ్యాయులు
- న్యాల్‌కల్ కేజీబీవీని సందర్శించిన డీఈఓ, సీఎంఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని కేజీబీవీలో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక కేజీబీవీలో 181 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. 24న మౌనిక, సోనాబాయి, రేఖ ముగ్గురు విద్యార్థినులు అనారోగ్యానికి గురికాగా మెరుగైన వైద్యం కోసం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా శుక్రవారం మరో 11 మంది విద్యార్థినులు విజలక్ష్మి, రాజేశ్వరీ, వైష్ణవి, పూజ, భవిత, కవిత, వైశాలి, స్వాతి, రాణి, అశ్విని, పూజతోపాటు ఇద్దరు ఉపాధ్యాయులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా వైరల్ ఫీవర్ వల్లే విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు వైద్యులు అనుమానం వ్యక్తం చేశారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగానే ఉందని పేర్కొన్నారు.

కేజీబీవీని సందర్శించిన డీఈఓ

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సీఎంఓ వెంకటేశం తదితరులు కేజీబీవీని సందర్శించారు. ఘటన జరిగిన వెంటనే ఎందుకు చెప్పలేదని కేజీబీవీ ప్రత్యేకాధికారి పర్వీన్‌పై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆమెకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని జీసీడీఓను ఆదేశించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. భోజనం, వసతులు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. వంట గది, మూత్ర శాలలు, స్టోర్ రూమ్, విద్యాలయం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. వారి వెంట జీసీడీఓ అనురాధ, ఎంఈఓ మారుతి రాథోడ్, ఎంపీడీఓ రాజశేఖర్ కౌలాస్, ఎంపీఓ సురేశ్, హెచ్‌ఎం సచ్చిదానందరెడి ఉన్నారు.

వాకింగ్‌కు వెళ్లి గుండెపోటుతో వ్యక్తి మృతి


రవి (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన తప్పెట రవి (54) శుక్రవారం ఉదయం మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లాడు. ఎంతసేపు అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వెతకగా దారి మధ్యలో కిందపడి మృతి చెందాడు. గుండెపోటుతో మృతి చెందినట్లు మృతుడి సోదరుడు హరిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య సుశీల, ఇద్దరు పిల్లలున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చిరాగ్‌పల్లి ఎక్సైజ్ చెక్‌పోస్టు సమీపంలో 65వ జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ.రాజేందర్‌రెడ్డి కథనం మేరకు.. సుమారు 40 ఏళ్ల వయస్సు కల్గిన వ్యక్తి కాలినడకన వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కాషాయం బట్టలు ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని జహీరాబాద్ ఆస్పత్రికి తరలించామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

పాము కాటుతో..

గజ్వేల్‌రూరల్: పాము కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని క్యాసారంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వడ్యారం బాల్‌చంద్రం(32)కు భార్యతోపాటు పిల్లలున్నారు. వ్యవసాయ కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత పాము కాటు వేయగా గమనించిన కుటుంబీకులు వెంటనే గజ్వేల్ ప్రభుత్వాసత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వంటిమామిడిలోని ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యవసాయ అనుబంధ పనులు ఎంపిక

డీఆర్‌డీఓ శ్రీనివాసరావు


మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీనివాసరావు

కౌడిపల్లి(నర్సాపూర్): ఉపాధి హామీలో కూలీలకు పనులు కల్పించేందుకు వ్యవసాయ అనుబంధ పనులు ఎంపిక చేయాలని డీఆర్‌డీఓ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాలవారిగా చేపట్టిన పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీలో 266 రకాల పనులు ఉన్నాయన్నారు. అన్ని గ్రామాల్లో పూడికతీత, రోడ్లు, మొక్కల పెంపకం లాంటి నాలుగైదు రకాల పనులు మాత్రమే చేస్తున్నారని అన్నారు. 266 రకాల పనుల్లో కనీసం 60 శాతం పనులకు ఎంపిక చేయాలన్నారు. గ్రామ సభ ద్వారా గ్రామాభివృద్ధికి ఉపయోగపడే పనులు గుర్తించాలన్నారు. 2025–26 సంవత్సర ప్రణాళికలో 200 శాతం పనులను గుర్తించాలన్నారు. వచ్చే 5 నెలల్లో ఈ ఏడాది ఎంపిక చేసిన పనులను పూర్తి చేయాలన్నారు. పనులు పూర్తిచేయకుంటే కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ పుణ్యదాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలు

వట్‌పల్లి(అందోల్): విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలైన ఘటన అందోల్ మండలం అన్నాసాగర్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ కళాశాల సోలార్‌లో విద్యుత్ సమస్య ఏర్పడింది. ఏఈ అలీ హుస్సేన్ కళాశాలలో పని చేస్తున్న కిషన్ అనే కార్మికుడిని తీసుకొని అన్నాసాగర్ 132 సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లాడు. అక్కడ పనులు చేస్తుండగా ఒక్కసారిగా కరెంట్ షాక్‌కు గురై కార్మికుడు కిందపడిపోయాడు. తీవ్ర గాయాలైన కిషన్‌ను జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరు గైన వైద్యం సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ట్రాన్స్‌కో ఏఈ, జేఎన్టీయూ ఏఈ, ఆపరేటర్లు అక్కడే ఉన్నా ప్రమాదం ఎలా జరిగిందో అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు గ్యారేజీ దగ్ధం


తూప్రాన్ : మంటల్లో దగ్ధమైన కార్లు

9 కార్లు కాలి బూడిద
- సుమారు రూ. 15 లక్షల వరకు నష్టం
- తూప్రాన్ పేటలో ఘటన

తూప్రాన్: ప్రమాదవశాత్తు కారు గ్యారేజీ దగ్ధమైన ఘటన తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నర్సాపూర్ చౌరస్తా సమీపంలో లిమ్రా మోటార్స్ పేరుతో సోయల్ అనే వ్యక్తి కొంత కాలంగా కారు గ్యారేజీ నడుపుతున్నాడు. రోజు మాదిరిగా రాత్రి 9గంటలకు గ్యారేజీ బంద్ చేసి ఇంటికెళ్లాడు. అర్ధరాత్రి గ్యారేజీ నుంచి మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో సోయల్ గ్యారేజీ వద్దకు చేరుకొని పక్కనే ఉన్న నివాసాల ఇళ్ల నుంచి నీటితో మంటలార్పే ప్రయత్నం చేశారు. అనంతరం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో నర్సాపూర్, రామాయంపేట నుంచి ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. అప్పటికే తొమ్మిది కార్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. వాటి విలువ సుమారు రూ.15 లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. తనంటే గిట్టనివారే ఈ ప్రమాదం చేసి ఉంటారని బాధితుడు సోయల్ ఆరోపించారు. పోలీసులు మాత్రం షార్ట్ సర్క్యూట్‌తో అయ్యి ఉండొచ్చు అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు.


చిన్నశంకరంపేట(మెదక్): పరిశ్రమలో ఎగిసిపడుతున్న మంటలు

పరిశ్రమలో అగ్ని ప్రమాదం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ఎలిమెంటరీ కన్వర్టర్స్(మొలల కంపెనీ)లో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం ఉదయం పరిశ్రమలోని కాటన్లను నిల్వ చేసే గోదాంలో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో పరిశ్రమలోని కార్మికులు మంటలార్పే ప్రయత్నం చేశారు. అయినా అదుపులోకి రాలేదు. మెదక్, రామాయంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి సుమారులు మూడు గంటల పాటు శ్రమించి మంటలార్పేశారు. సుమారు రూ.కోటి వరకు నష్టం జరిగే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు కంపెనీ డైరెక్టర్ జై కిసాన్ తెలిపారు.

భార్య మృతదేహం మెడికల్ కళాశాలకు అప్పగింత

- గతంలోనూ తండ్రి మృతదేహం అందజేసిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు

హత్నూర(సంగారెడ్డి): భార్య అనారోగ్యంతో మృతి చెందగా ఆ మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించాడు ఓ ఉపాధ్యాయుడు. హత్నూర మండలం గుండ్ల మాచునూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సాయమల్ల చంద్రయ్య భార్య రుక్మిణి (54) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. మృతదేహాన్ని ఖననం చేయకుండా సంగారెడ్డి సమీపంలోని ఎమ్మెన్నార్ మెడికల్ కళాశాలకు అప్పగించారు. 2019లోనూ తండ్రి పోచయ్య చనిపోతే మృతదేహాన్ని ఇదే కళాశాలకు ఇచ్చారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న చంద్రయ్య చనిపోయిన మృతదేహాలను పూడ్చిపెట్టడం కంటే మెడికల్ కళాశాలకు ఇవ్వడం వల్ల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందనే ఉద్దేశ్యంతో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.

లాడ్జిలో వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఓ లాడ్జిలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జహీరాబాద్ టౌన్ పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్‌లోని భానునగర్‌కు చెందిన ఎండీ రఫియొద్దీన్(62) నాలుగు రోజుల కిందట జహీరాబాద్ పట్టణానికి వచ్చాడు. పట్టణంలోని శ్రీనివాస్ మహల్ సమీపంలో గల లాడ్జిలో రూమ్ తీసుకొని ఉన్నాడు. శుక్రవారం రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొబ్బరి పువ్వు.. ప్రయోజనాలు మెండు


పువ్వులను విక్రయిస్తున్న శ్రీనివాస్


పువ్వును తింటున్న యువకుడు

- క్రిష్ణగిరి నుంచి తీసుకొచ్చి సిద్దిపేటలో విక్రయాలు
- తినడానికి ఆసక్తి చూపుతున్న ప్రజలు

సాక్షి, సిద్దిపేట: కొబ్బరి కాయలే కాదు.. పువ్వు కూడా చాలా ప్రయోజనాలను కలిగిస్తుంది. మనం ఎక్కువగా కొబ్బరి కాయలను విక్రయిస్తుండగా చూస్తుంటాం. కానీ సిద్దిపేట పట్టణంలో మాత్రం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలోని క్రిష్ణగిరి నుంచి మొలకెత్తిన కొబ్బరి కాయలను తీసుకొచ్చి అమ్ముతున్నారు. శ్రీనివాస్ అనే వ్యాపారి సూర్యాపేట నుంచి ఇక్కడి అమ్మకాలు జరుపుతున్నారు. దేవుడి ముందు కొట్టిన కొబ్బరికాయలో పువ్వు వస్తే చాలా శుభప్రదమని చాలా మంది భక్తుల నమ్మకం.. దీనిని తింటే ఆరోగ్యానికి సైతం ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని విక్రయించే వారు చెబుతున్నారు. ఇందులో కాల్షియం, పోటాషియం, మెగ్నిషియం, మాంగనీస్, ఫాస్ఫరస్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయని అంటున్నారు.

తెలుసుకొని తింటున్న ప్రజలు

కొబ్బరి కాయల మొలకలు విక్రయిస్తుండటంతో వాహనదారులు, స్థానికులు వచ్చి వాటి గురించి తెలుసుకొని మరీ తింటున్నారు. ఎంతో రుచికరంగా ఉండటంతో చిన్నారులు, యువత, పెద్దలు తినడానికి ఆసక్తి చూపుతున్నారు. కొబ్బరి కాయను పగులగొట్టి అందులో నుంచి పువ్వును కట్ చేసి ఇస్తున్నారు. ఒకటి అయితే రూ.80కి, రెండు అయితే రూ.150, మూడు కొబ్బరి పువ్వులు రూ.200లకు విక్రయిస్తున్నారు.

చెట్లు నాటేందుకు కూడా..

క్రిష్ణగిరి నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నాం. కొబ్బరి పువ్వు అనేది ఎక్కువ మందికి తెలియదు కాబట్టి దీని గురించి అడిగి మరీ తెలుసుకొని తింటున్నారు. మంచి స్పందన ఉంది. కొందరు చెట్లుగా నాటేందుకు సైతం కొనుగోలు చేస్తున్నారు.
– శ్రీనివాస్, సూర్యాపేట

చాలా ప్రయోజనాలు..

హైదరాబాద్‌లో కొబ్బరి పువ్వును తిన్నాను. దీనిలో ఎక్కువగా హెల్త్ బెనిఫిట్‌లు ఉంటాయి. ఆరోగ్యానికి ఎంతో మంచిది ఇది.. సిద్దిపేటలో బైక్ పై వెళ్తుంటే విక్రయిస్తుండగా వాటిని చూసి ఆగాను. నాతోటి స్నేహితులకు సైతం తినిపించాను. వీటిలో ఉండే పోషక విలువల గురించి చెప్పాను. – రాజేశ్, సిద్దిపేట

చోరీల నిందితులు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ అభిలాష్

కోహెడ(హుస్నాబాద్): ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ పుల్ల అభిలాష్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. సముద్రాల గ్రామం నుంచి కోహెడ మార్గంలో గురువారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా టీవీఎస్ ఎక్సెల్‌పై సముద్రాల గ్రామం నుంచి కోహెడ వైపు వస్తున్నారు. తనిఖీ దగ్గరకు రాగానే పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకొని విచారించాం. కోహెడ మండలం వేంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన రేగుల శ్రీనివాస్ (31), షేక్ ఇమామ్(75), కోహెడకు చెందిన పెసరు పరుశరాములు(28) ముగ్గురూ కలిసి కోహెడ మండల పరిధిలోని కూరెల్లా, శనిగరం, చెంచల్‌చెర్వుపల్లి, నాగసముద్రాలకు చెందిన పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. అలాగే కరీంనగర్ జిల్లా గన్నేరువరం, చిగురుమామిడి మండలంలోని నవాబుపేట, కొండాపూర్ గ్రామాల్లోని దేవాలయాల్లో చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. నిందితులను అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

గంజాయి కేసులో నలుగురు రిమాండ్

నంగునూరు(సిద్దిపేట): గంజాయి కేసులో కోర్టుకు హాజరుకాని నలుగురిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు కావడంతో శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఆసీఫ్ తెలిపారు. నర్మేటకు చెందిన కలకుంట్ల రాజశేఖర్, అప్పల రమేశ్, అప్పలాయిచెర్వు గ్రామానికి చెందిన నాయిని రాజశేఖర్‌రెడ్డి, కోనాయిపల్లికి చెందిన పిల్లి చందుపై గంజాయి కేసులో నిందితులుగా ఉన్నారన్నారు. సిద్దిపేట కోర్టులో పేసీకి హాజరు కాకపోవడంతో వారిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యిందన్నారు. నిందితులను పట్టుకొని కోర్టులో హాజరుపర్చగా జడ్జి 14 రోజులు జ్యుడిషియల్ రిమాండ్ విధించడంతో కరీంనగర్ జైలుకు తరలించామని తెలిపారు.

దొంగతనం కేసులో ముగ్గురు మహిళలు

కల్హేర్(నారాయణఖేడ్): పట్టపగలు చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు మహిళలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు. ఆయన కథనం మేరకు.. కల్హేర్ మండల కేంద్రానికి చెందిన బత్తిని పద్మవ్వ 15న సోయా పంట కోత పనులు చేసేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లింది. పనులు ముగించుకొని వచ్చాక ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2 తులాల బంగారు పుస్తెల తాడు, 5 మాసాల బంగారు కమ్మలు, 20 తులాల వెండి కడియాలు, రూ.30 వేల నగదు చోరీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనుమానితులు కల్హేర్‌కు చెందిన మీసాల గంగవ్వ, శేగోళ్ల చంద్రకళ, అల్లాపురం ఉమను అదుపులోకి తీసుకొని విచారించారు. చోరీ చేసినట్లు అంగీకరించడంతో అరెస్టు చేశారు. మొత్తం చోరీ సొత్తు రికవరీ చేసినట్లు పేర్కొన్నారు.

అనిల్‌రాజ్ హత్య కేసులో ఇద్దరు..


నిందితులను చూపుతున్న సీఐ మహేశ్‌గౌడ్

సదాశివపేట(సంగారెడ్డి): యువకుడి హత్య కేసులో ఇద్దరు నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మహేశ్‌గౌడ్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. సిద్దాపూర్ కాలనీకి చెందిన మెత్రీ అజయ్‌రాజ్ తల్లి 2022లో తమ పాలివారైన అనిల్‌రాజ్, అతడి తమ్ముడు శ్రీకాంత్‌రాజ్ వల్లే చనిపోయిందని, ఇద్దరు అన్నాదమ్ముళ్లపై అజయ్‌రాజ్ పగ పెంచుకున్నాడు. దీంతో అనిల్‌రాజ్‌ను ఎలాగైన హత్య చేయాలని పథకం వేశాడు. ఈ నెల 20న అర్ధరాత్రి 12 గంటల వరకు మెత్రీ అజయ్‌రాజ్, తాంబ్యా రాజేష్, అనిల్‌రాజ్ ముగ్గురూ మద్యం సేవించారు. అనంతరం ప్రభుత్వ నర్సరీలో గల రేకుల షెడ్డులో పేకాట ఆడటానికి వెళ్లారు. కొద్దిపేటకి అజయ్‌రాజ్ తన వెంట తెచ్చుకున్న పదునైన కత్తితో అనిల్‌రాజ్‌ను హత్య చేశారు. దీనికి రాజేశ్ సహకారం అందించాడు. కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులు అజయ్‌రాజ్, రాజేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హత్య కేసును ఛేదించిన పోలీసులను డీఎస్పీ సత్తయ్యగౌడ్ అభినందించినట్లు సీఐ మహేశ్‌గౌడ్ తెలిపారు.